ప్రజాశక్తి

శనివారం 7 జనవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

లారీల్లో సరుకు లోడు.. వినేదెవరు మా గోడు..

- లోడింగ్, అన్‌లోడింగ్ భారం మాపై మోపొద్దు
- ప్రభుత్వ అస్పష్ట విధానంతో నష్టపోతున్నాం : ఎపి లారీ ఆపరేటర్ల ఆందోళన
- భవిష్యత్తు కార్యాచరణపై ఎగ్జిమ్ పార్కు గేటు వద్ద నేడు సమావేశం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రం, దేశంలో ఎక్కడైనా ప్రజలకు నిత్యావసర సరుకులు సకాలంలో అందుతుండటంలో లారీల పాత్రే కీలకం. ఆకుకూరలు, కాయగూరలు, ఆయిల్‌లు, పప్పులు, ఉప్పులు ఇలా ఒకటేమిటి వందల రకాల ప్రజా వినియోగ సరుకులు, ఉత్పత్తులన్నీ మన దగ్గరకు వచ్చేవి లారీల్లోనే. అయితే, ఈ లారీలు ఎక్కడికక్కడ మొండికేస్తే జనాలకు సరుకులేవీ అందడం సాధ్యపడదు. అలాంటి లారీలను సప్లయ్ చేసే ఆపరేటర్ల సమస్యలపై మాత్రం ప్రభుత్వాలు సానుకూలంగా లేవు. లారీల్లో సరుకులు లోడింగ్, అన్‌లోడింగ్ జరిగే సందర్భాల్లో నియమించుకునే కళాశీల భారాన్ని లారీలపై మోపేలాగ ప్రభుత్వ చర్యలు ఉండడంతో లారీల యజమానులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ నిరసనను తెలియజేసేందుకు శనివారం విశాఖలోని నేవల్ డాక్‌యార్డు, షీలానగర్ రోడ్డులో హెచ్‌పిసిఎల్ నార్త్‌గేట్ ఎదుటగల ఎగ్జిమ్ పార్కు వద్ద ఉదయం 10 గంటలకు రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఎపి లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించడానికి సిద్ధమయ్యారు.

లారీ ఓనర్లు, లారీల సరఫరాదారుల సమస్య ఏమిటి?

ఉత్తరాంధ్రకు చెందిన ఉమ్మడి మూడు జిల్లాల నుంచి కృష్ణా జిల్లా వరకూ సుమారు 500 లారీలను విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు సరుకుల ఎగుమతులు, దిగుమతుల కోసం సరఫరా చేస్తుంటారు. ఈ సందర్భంగా లోడింగ్, అన్‌లోడింగ్ చేసేటప్పుడు సరుకు ఓనర్లు అంటే కొనుగోలు, అమ్మకం చేసే వ్యాపారులు కాకుండా లారీలే కళాశీలకు మామూళ్లు ఇచ్చే పరిస్థితి కొనసాగుతోంది. తమకు అంతకంతకూ భారంగా ఉందంటూ లారీ ఆపరేటర్లు ఆవేదన చెందుతున్నారు. ఈ ఆశీలను ఆయా మార్కెట్లను వేలం పాటల్లో దక్కించుకున్న రాజకీయ నాయకులు చెల్లించాలని, ప్రభుత్వం కూడా అలా ఒక జీవో ఇవ్వాలని ఎపి లారీ ఆపరేటర్స్, ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బాపిరాజు 'ప్రజాశక్తి'కి శుక్రవారం తెలిపారు. వేలం పాటలు పాడి రూ.లక్షలు ఆర్జించే రాజకీయ నాయకుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మెతకగా ఉంటూ, మరోవైపు సరుకుల ఓనర్లను కూడా ఆశీలు చెల్లింపులు చేయనివ్వకుండా ప్రభుత్వం చేస్తోందంటూ వారు మిగతా 2లో..



గ్లోబల్ హెల్త్ సమ్మిట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రజని తదితరులు

వార్త మెయిన్‌లో..

టెలీ మెడిసిన్‌లో అగ్రభాగాన రాష్ట్రం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో..

ఒకే ప్రాంతం ఓట్లు.. ఒకే బూత్‌లో ఉండాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఒకే ప్రాంతంలో ఉన్న ఓట్లు అన్నీ ఒకే బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో జగ్గునాయుడు, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పాల్గొని ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఒకే ప్రాంతానికి చెందిన ఓట్లన్నీ ఒకే బూతులో ఉండేలా సరిచేయాలని, ఒక క్రమ పద్ధతిలో ఓటరు జాబితా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఓటరు లిస్టులను ఎపిసిఇఒ వెబ్‌సైట్‌లో పిడిఎఫ్ డేటా ఫార్మెట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. బోగస్ ఓట్లను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాలోని బూత్‌ల్లో ఓట్లను పరిశీలించినపుడు అవి క్రమపద్ధతిలో లేవన్నారు. బూత్‌లలోని ఓట్లు చాలా గందరగోళంగా ఉన్నాయన్నారు. ఒకే ప్రాంతానికి చెందిన వారి పేర్లు సుమారు 20 నుంచి 30 బూత్‌ల్లో ఉన్నాయని తెలిపారు. కొందరి ఓటర్ల పేర్లు వారి నివాసానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బూత్‌ల్లో ఉన్నాయన్నారు. ఎంవిపి.కాలనీకి సంబంధించిన ఓట్లు గాజువాక, కూర్మన్నపాలెం, కంచరపాలెం, పెందుర్తి, మధురవాడ, అక్కయ్యపాలెం.. ఇలా జిల్లాలో మిగతా 2లో..

'గీతం' పరిసరాల్లో

ప్రభుత్వ భూమికి కంచె

వైద్య కళాశాల భవనాలను కూలగొడతారన్న ప్రచారంతో తీవ్ర ఉత్కంఠ

ప్రజాశక్తి - మధురవాడ : విశాఖలోని గీతం వర్సిటీ వైద్య కళాశాల పరిసరాల్లో గతంలో గుర్తించిన ప్రభుత్వ భూమి చుట్టూ జివిఎంసి, రెవెన్యూ అధికారులు శుక్రవారం కంచెను ఏర్పాటు చేశారు. కంచె పనులను వేకువజామున భారీ పోలీసు బందోబస్తుతో చేపట్టడంతో తొలుత తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గీతం వైద్య కళాశాల భవనాలను కూలుస్తారనే ప్రచారంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న హైటెన్షన్ నెలకొంది. ఎండాడ, రుషికొండవైపు వెళ్లే మార్గాల్లో మిగతా 2లో..



కంచె ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డు పెడుతున్న అధికారులు

మొదటి పేజీ తరువాయి..

లారీల్లో సరుకు లోడు.. వినేదెవరు మా గోడు..

చెబుతున్నారు. వ్యాపారాలు చేసుకునే వారే ఆశీలు కట్టుకునేలాగ ప్రభుత్వం ఆచరణలో అమలయ్యే ఓ విధానాన్ని తీసుకురావాలన్న డిమాండ్‌తో తాజాగా ఎపి లారీ ఓనర్లంతా ఏకమవుతున్నారు. విశాఖ జిల్లాలో గాజువాక, విశాఖ నగరం, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరంలలో కళాశీలకు రూ.200 నుంచి రూ.300 వరకూ ఎంతమంది సరుకు దించడం, ఎత్తడంలో పాల్గొంటే అంతమందికీ ఇవ్వాల్సి వస్తుందని వీరు మొరపెట్టుకుంటున్నారు.

ఏటా వేలం పాటలు నిరమించాలి

వేలం నిర్వహించడం వల్లే రాజకీయ నాయకులు మార్కెట్లను హస్తగతం చేసుకుని ఆశీలు కూడా కళాశీలకు చెల్లించకుండా వ్యవహరిస్తుండడం పరిపాటి. వేలం నిర్వహించకపోతే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పరిస్థితి లేదు. మరోవైపు కళాశీలకు చెల్లింపులు సరుకు లోడింగ్‌లో అమ్మకందారు, అన్‌లోడింగ్‌లో కొనుగోలుదారు చెల్లించేలాగ కోర్టుల ఆదేశాలూ ఉన్నా ప్రభుత్వం అమలు చేయకపోవడం కూడా ఒక లోపంగా ఉంది. లారీల ఓనర్లు కళాశీలకు చెల్లింపులు చేయనవసరం లేదని కోర్టు ఆదేశాలు ఉన్నట్లు సంబంధిత నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పలు మార్కెట్లలో లారీ ఓనర్లు, లోడింగ్, అన్‌లోడింగ్ వ్యాపారుల మధ్య తలెత్తే వివాదాలు నానాటికీ పెరుగుతున్నాయి. పోలీసుల జోక్యం ఉన్నప్పటికీ లారీల ఆపరేటర్లకు అనుకూలంగా ఉండడం లేదన్నది తెలుస్తోంది. రాజకీయ నాయకులే వేలం పాటలు పాడుకుని మార్కెట్లపై అజమాయిషీ చలాయిస్తున్నందున వీరికి వారి నుంచి ఫోన్ కాల్స్ రావడంతో వీరు ఈ తగాదాల్లో తలదూర్చడం లేదు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎగ్జిమ్ పార్కు గేటు వద్ద ఎపి లారీ ఆపరేటర్స్, ఓనర్స్, సప్లయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరుగనుంది. ఎపి లారీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాపిరాజు, పి.వెంకటరాజు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఒకే ప్రాంతం ఓట్లు.. ఒకే బూత్‌లో ఉండాలి

అనేక బూత్‌ల్లో ఉన్నాయని ఉదహరించారు. ఇలాంటివి కొన్నివేల సంఖ్యలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం కలెక్టర్ ఇచ్చిన ఇమేజ్ ఫార్మెట్‌లో ఓటరు తమ ఓటు గుర్తించడం సాధ్యం కాదన్నారు. దీని వల్ల ఎక్కువ మంది ఓటు వున్నా ఏ బూతులో ఉందో తెలుసుకోలేకపోవడం వల్ల ఓటు హక్కు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

ఎపిసిఇఒ వెబ్‌సైట్‌లో ఎంఎల్‌సి ఓటరు జాబితాను ఇమేజ్ ఫార్మెట్‌లో పెట్టారని, దీనివల్ల ఓటరు ఎక్కడ తన పేరు ఉందో తెలుసుకోలేకపోతున్నారని చెప్పారు. అదే ఓటరు లిస్టు పిడిఎఫ్ డేటా ఫార్మెట్‌లో ఉంటే తన పేరును సెర్చ్ ద్వారా సులభంగా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

మొదటి విడత ప్రకటించిన 297 బూత్‌ల ముసాయిదా జాబితాలో 10,884 మంది ఓటర్లను అనర్హులుగా గుర్తించి తీసివేశారన్నారు. తమ పార్టీ గత నెల 5న విశాఖ జిల్లాలోనే 94 బూతుల్లో 2163 మంది డిగ్రీ అర్హత లేనివారి పేర్లు, ఒకే పేరు 3, 4 సార్లు నమోదైన వారి 8,487 మంది పేర్లతో లిస్టును అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. వీరిలో అత్యధిక మంది ఫైనల్ ఓటరు జాబితాలో కొనసాగుతున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇలా మొత్తం అన్ని జిల్లాల్లో వేల సంఖ్యలో బోగస్ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. రెండో దశలో నమోదైన 50,730లో కూడా పెద్ద సంఖ్యలో బోగస్ ఓటర్లు ఉన్నారన్నారు. వీటన్నింటిపై రీసర్వే చేసి అనర్హులను తొలగించాలని కోరారు.

ప్రభుత్వ భూమికి కంచె

పోలీసులు బారికేడ్లు పెట్టి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మరోవైపు విషయం తెలిసి టిడిపి నాయకులు గీతం వర్సిటీ వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆ పార్టీకి చెందిన కొంత మంది నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆసక్తి నెలకొంది. గతంలో స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిలో కంచె ఏర్పాటు చేస్తున్నట్లు భీమిలి ఆర్‌డిఒ భాస్కరరెడ్డి పేర్కొనడంతో ఉత్కంఠకు తెరపడింది. ఆ తరువాత కంచె ఏర్పాటు పనులు సజావుగా సాగాయి. పలుచోట్ల ఇది 'ప్రభుత్వ భూమి' అంటూ అధికారులు బోర్డులు పెట్టారు. కళాశాలను ఆనుకుని ఉన్న 14 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలోనే స్వాధీనం చేసుకున్నామని, ఇప్పుడు కంచె మాత్రమే ఏర్పాటు చేశామని ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి మీడియాకు తెలిపారు.

భూ వ్యవహారం కోర్టు పరిధిలో ఉండగా చర్యలా : టిడిపి

కలెక్టరేట్ : 'గీతం మెడికల్ కాలేజీ భూ వ్యవహారం కోర్టులో ఉంది. అటువంటప్పుడు ఎటువంటి నోటీసూ ఇవ్వకుండా ఆ భూమిలో ప్రవేశించి, నిర్మాణాలను తొలగించి ఫెన్సింగ్ వేయడం సరికాదు' అని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉన్న భూమిలో హడావుడి కంచె వేయడం ఏంటని ప్రశ్నించారు. నలుగురు ఎసిపిలు, 400 మంది పోలీసులతో వచ్చి ఎవరిని భయపెట్టాలని ముఖ్యమంత్రి జగన్ చూస్తున్నారని మండిపడ్డారు. కేవలం ఈ కాలేజీ టిడిపికి చెందిన వారిదనే కక్ష సాధించుకుంటున్నారని విమర్శించారు. మార్కెట్ వేల్యూ ప్రకారం స్థలానికి డబ్బు కడతామని చెప్పినా తోసిపుచ్చడం భావ్యం కాదన్నారు. సమావేశంలో టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పాల్గొన్నారు.

ఆర్గానిక్ మేళా ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గో ఆధారిత ప్రకృతి వ్యవసాయోత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం చేకూరుతుందని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఎంవిపి కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరుగనున్న మూడవ విశాఖ ఆర్గానిక్ మేళాను శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కాలుష్యం విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి పెనుప్రమాదం ఏర్పడుతున్న ప్రస్తుత కాలంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహారోత్పత్తులు ప్రజలకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. రైతులు ఆ వ్యవసాయంవైపు మళ్లాలని సూచించారు. కేంద్ర విదేశీ వ్యవహారాలు, పార్లమెంట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ మాట్లాడుతూ ఇటువంటి ఆర్గానిక్ మేళాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, కేంద్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహించడానికి పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఈ ఏడాది దేశంలో జరిగే జి - 20 సమ్మిట్‌లో మిల్లెట్స్‌ను ప్రోత్సాహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రాంత స్థానిక ఉత్పత్తులకు ప్రపంచ స్థాయిలో ప్రచారం కల్పించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఎంపీ జివిఎల్.నరసింహారావు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి రత్నం పాల్గొన్నారు.

11 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : త్యాగరాజ ఆరాధన ట్రస్టు, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 11 నుంచి 16 వరకూ త్యాగరాజ ఆరాధనోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం కళాభారతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి వీలైనంత ఎక్కువ మందిని అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఉదయం 7 గంటలకే కార్యక్రమాలు ప్రారంభించి రాత్రి 9 వరకు కొనసాగేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత డీన్ ఆచార్య ఎ.ప్రసన్న కుమార్ హాజరవుతారన్నారు. ఉత్సవాల షెడ్యూల్‌ను తెలిపారు. అనంతరం త్యాగరాజ ఆరాధన ఉత్సవాల పోస్టర్‌ను అకాడమీ అధ్యక్షులు మంతెన సత్యనారాయణ, ట్రస్ట్ పైడా కృష్ణ ప్రసాద్, ఎస్.రామగోపాల్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ పంతులు గోపాలరావు, మోహనదాస్ ఆవిష్కరించారు.

నోటిఫికేషన్‌కు పది రోజుల ముందు వరకూ..

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఓటరు నమోదుకు సంబంధించి వ్యక్తిగత క్లెయిములు, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను నోటిఫికేషన్ వచ్చే పది రోజుల ముందు వరకు స్వీకరించవచ్చునని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు బిఎల్‌ఒల ద్వారా పరిశీలించి నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎటువంటి సందేహాలు ఉన్నా, లిఖిత పూర్వకంగా కార్యాలయానికి తెలియజేసినట్లయితే పరిశీలిస్తామన్నారు. వాలంటీర్లు ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొనరాదని, వారు పాల్గొన్నట్లు ఫిర్యాదులు అందితే విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణ తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఏర్పాటు కావడం వల్ల ప్రత్యక్షంగా 30 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభించిందని, అటువంటి ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడం తగదని హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు పి.పైడిరాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 645వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అదానీ, అంబానీలకు చెందిన కార్పొరేట్ సంస్థలకు వెళితే ఎక్కువ మంది ఉపాధి కోల్పోతారని తెలిపారు. రెండేళ్లుగా ఉక్కు ఉద్యమం సాగుతున్నా కేంద్రం దిగి రాకపోవడం శోచనీయమన్నారు. దీక్షల్లో కూర్చున్న వారిలో యూనియన్ కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, ఎస్.లోకేష్, పి.సురేష్, వై.ఆనంద్, పి.భాస్కర్ ఉన్నారు.

జిఒ 1 ప్రతుల దగ్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజ్యాంగానికి, భావ స్వేచ్ఛకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెంబర్ 1ని వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జగదాంబ సమీపంలోని పార్టీ కార్యాలయం వద్ద జిఒ 1 కాపీలను ఆ పార్టీ కార్యకర్తలు దగ్ధం చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు గొంప గోవిందరాజు, రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

8న డాగ్ షో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ కెనైన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న నగరంలో అతిపెద్ద డాగ్ షో, డాగ్ ఫ్యాషన్ షోతో పాటు క్యాట్ షో, బర్డ్ షో, అక్వేరియం షో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రకాష్, ఎస్.రావు తెలిపారు. శుక్రవారం ఎంవిపి.కాలనీలోని ఎఎస్.కాలేజీ మైదానంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

8న జిప్సా విహారయాత్ర

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా)లిఆధ్వర్యంలో సభ్యులందరితో అచ్యుతాపురం దగ్గర సీతపాలెం బీచ్‌కు విహారయాత్ర నిర్వహిస్తున్నట్లు జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఒకరోజు ఆటవిడుపుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విహారయాత్రలో సభ్యులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు.

కీళ్ల మార్పిడిపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్ సిటీ, అపోలో ఆసుపత్రిలో జనవరి 8న ఆర్థరటీస్, కీళ్ళ మార్పిడిపై ఉచిత మెగా వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆసుపత్రి సిఇఒ శ్రీరామచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు నిర్వహించే కార్యక్రమంలో కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ నవీన్ పల్లా మోకాళ్ల మార్పిడి ఏ పరిస్థితిలో చేయాలి, కీళ్ళ మార్పిడికి ఉపయోగించే టెక్నాలజీ, దాని ద్వారా వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా రోగులకు బిపి, ఎక్స్‌రే, ఎముకల సాంద్రత వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారు. సదస్సుకు హాజరయ్యే రోగులకు కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్సకు ప్రత్యే రాయితీ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీమా పరిహారం అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : వైఎస్‌ఆర్ బీమా పరిహారం కింద 13వ వార్డు మూడవ సచివాలయం పరిధిలో మృతి చెందిన బమ్మిడి వెంకటరావు, బండారు సత్తిబాబు కుటంబాలకు రూ.90వేలు చొప్పున పరిహారం చెక్కులను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత అందజేసారు.సచివాలయ సెక్రటరీలు రమణ, సురేంద్ర, వైసిపి వార్డు అధ్యక్షులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, బేత దుర్గారావు, వెంకట రెడ్డి, పాండ్రింకి శ్రీను, వంకర బాబూరావు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : తన దృష్టికి వచ్చిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక మార్కెట్ పునరుద్ధరణకు, పార్కుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వార్డుల్లో పర్యటనలు చేస్తూ సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తాన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి క్లాప్ వాహనం ఢీకొని మృతి చెందిన బవిరిశెట్టి రాంబాబు కుటుంబానికి స్థానిక గాయత్రి జెరాక్స్ అధినేత దేశెట్టి లీలావతి ఆసరగా నిలిచారు. శుక్రవారం మాజీ కౌన్సిలర్ పిట్టా సురేష్ ద్వారా బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో పంచదార, వంట నూనె, కంది పప్పు అందజేశారు.కార్యక్రమంలో రజక సంఘం నేతలు పాల్గొన్నారు.

9న జివిఎంసి కార్మికుల టోకెన్ సమ్మె



కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నేత రాజ్‌కుమార్

ప్రజాశక్తి -పిఎం పాలెం :మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు, మినిట్స్‌లో అంగీకరంచిన అంశాలను అమలు చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనికి నిరసనగా ఈనెల 9న టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చినట్లు సిఐటియు జోన్ కార్యదర్శి పి.రాజ్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం చంద్రపాలెం పాఠశాల వద్ద మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ కమిషనర్, మున్సిపల్ రాష్ట్ర అధికారులు సమావేశంలోనూ, పోరాటాల సమయంలో ని ఇచ్చిన హామీలు, చేసుకున్న ఒప్పందాల అమలులో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మరణించిన కార్మికుల వారసులు, అనారోగ్యం వల్ల దీర్ఘకాలంగా సెలవులో ఉన్నవారు, అరవైఏళ్లు నిండి, ఉద్యోగాలు ఆపిన కార్మికుల కుటుంబాలకు చెందిన 482 మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. క్లాప్ వెహికల్ డ్రైవర్లకు జిఒ7 ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీటిసరఫరా, విద్యుత్, యు జి డి కార్మికులకు రిస్క్ అలవెన్స్ఇవ్వాలని కోరారు. ఆపకస్‌లో చేరని వారిని చేర్చి, వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి నిరసనగా చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు డి.అప్పలరాజు.జి.కిరణ్, కె.నాగరాజు, జి విజయ్,బి రాంబాబు,కే ఆర్జునమ్మ, ఎం సుశీలమ్మ,క్లాప్ వెహికల్ సంఘం జోన్ అధ్యక్ష,కార్యదర్శులు కే సన్ని, సొండి చిన్నబాబు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి -ములగాడ : ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్కాపురం కళంజియ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక మల్కాపురం ఏడుగుళ్ల సెంటర్లోని గౌరీ సంఘం కార్యాలయంలో శుక్రవారం మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్, అవగాహన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మనిషి జీవనశైలి వల్ల కేన్సర్ వచ్చే అవకాశం ఉందని, తొలి దశలోనే గుర్తిస్తే ఈ మహమ్మారి నుంచి పూర్తి నివారణ పొందవచ్చని తెలిపారు. ఈ క్యాంపులో 135 మంది కళంజియం సభ్యులు పరీక్షలు చేయించుకోగా, నలుగురికి కేన్సర్ సంబంధిత సమస్యలున్నట్లు నిర్ధారించి, మెరుగైన వైద్యానికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుభద్ర, డాక్టర్ బెంటేన, క్యాంపు కోఆర్డినేటర్ శివరామకృష్ణ, అర్జున్, వైజాగ్ రీజినల్ హెల్త్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, సమాఖ్య కోఆర్డినేటర్ సుభాషిణి, హెల్త్ అసోసియేట్ విజయ, సమాఖ్య సిబ్బంది, సమాఖ్య నాయకులు ఆదిలక్ష్మి, రెయ్యమ్మ, ఉమామహేశ్వరి, పార్వతి, క్లస్టర్ ఈసి లీడర్లు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిత్య కృషీవలురు జర్నలిస్టులు

విజెఎఫ్ స్పోర్ట్స్ మీట్‌లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడే నిత్య కృషీవలురు జర్నలిస్టులని, గెలుపోటములతో సంబంధం లేని నిత్యవిజేతలు వీరేనని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. శుక్రవారం విజెఎఫ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సిఎంఆర్ ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌లో క్రికెట్ పోటీలకు వచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆటలపోటీల్లో గెలుపోటములు సర్వసాదారణ మన్నారు. సామాజిక సేవలో స్ఫూర్తిమంతులైన జర్నలిస్టులు, క్రమంత ప్పకుండా క్రీడలు నిర్వహించాల న్నారు. బాల్యంలోతాను ఆడిన అన్ని పోటీల్లోనూ విజేతగానే నిలిచేదానినని ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకున్నారు. విజెఎఫ్ కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ, తన వంతు సహకారం ఎల్లపుడూ ఉంటుందన్నారు. పెందుర్తి ఎంపిపి మధుపాడ నాగమణి మాట్లాడుతూ జర్నలిస్టుల ద్వారానే అనేక ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నానని, వారు నిర్వహించి, పాల్గొనే ఆటల పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. విజెఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా విజెఎఫ్ పాలకవర్గం అనేక కార్యక్రమాలను చేపడుతోందని, ఈ నెల 12వరకుక్రీడా పోటీలు కొనసాగుతాయన్నారు. విజెఎఫ్ ఉపాధ్యక్షుడు ఆర్ నాగరాజు పట్నాయక్, కార్యదర్శి దాడి రవికుమార్, కోశాధికారి నరసింహ మూర్తి, స్పోర్ట్స్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఉమాశంకర్ బాబు, ఉపాధ్యక్షులు పిటిఐ భాస్కర్, కోశాధికారి పైలా భాస్కర్, కార్యవర్గ సభ్యులు ఎంఎస్ఆర్ ప్రసాద్, పి.వరలక్ష్మి, డి. గిరిబాబు, పి. దివాకర్, గయాజ్, పాల్గొన్నారు. అతిథులను విజెఎఫ్, విస్టా ఘనంగా సత్కరించింది.

కొత్త పించన్ల పంపిణీ



కంచరపాలెంలో మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి -కంచరపాలెం : ఉత్తర నియోజకవర్గం పరిధిలోని వివిధ వార్డుల్లో 458మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె రాజు అందజేశారు. శుక్రవారం మాధవదార, మాధవస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీల మేరకు విడతలవారీగా పింఛను పంపిణీతోపాటు అర్హులకు కొత్త పింఛన్లు మంజూరుకు సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సిఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజిని, సీనియర్ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, ఎపిడి పద్మావతి, వార్డు అధ్యక్షులు నీలి రవి, గుజ్జు వెంకట రెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.వెంగళరావు పాల్గొన్నారు.

పిఎం పాలెం: ఆరో వార్డు పరిధి పిఎం పాలెం, అవంతి కమ్యూనిటీ హాల్‌లో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం పంపిణీ చేశారు. 5,6,7,8 వార్డులకు సంబంధించి 726 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌సి కె.కనకమహాలక్ష్మి, నగరాల కార్పొరేషన్ ఛైర్మెన్ పిల్లా సుజాత సత్యనారాయణ, 8వ వార్డు వైసిపి కార్పొరేటర్ లొడగల అప్పారావు, 5,6,7 వార్డుల వైసిపి అధ్యక్షులు పోతిన హనుమంతు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీను, గాదె రోశిరెడ్డి, పోతిన ఎల్లాజీ, పోతిన ప్రసాద్, గుంటుబోయిన సంజీవ్, పిల్లా కష్ణ మూర్తి పాత్రుడు, పిల్లా సూరి బాబు, కుడితి రామారావు, అల్లాడ లింగేశ్వర రావు, జగుపిల్లి నరేష్,కురిటి లోహిత్ మహిళ, అధ్యక్షురాలు కొండపల్లి వరలక్ష్మి, షేక్ జహనర పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తగరపువలస : సంక్షేమ పథకాల అమలులో వైసిపి ప్రభుత్వం ముందంజలో ఉందని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చిప్పాడలో కొత్తగా మంజూరైన పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంపాడ రమావతి, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, ఎఎంసి ఛైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, మాజీ సర్పంచ్ సరగడం రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

పందులు, కుక్కల బెడద నివారించండి



ఎంఎహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి- గాజువాక : 87వ వార్డులో విపరీతంగా ఉన్న పందులు, వీధి కుక్కల బెడద నివారించాలని వార్డు వైసిపి నేతలు కోరారు. శుక్రవారం గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదేశాల మేరకు గాజువాక జోన్ ఎంఎంహెచ్ఒ డాక్టర్ కిరణ్ కుమార్‌ను కలిసిన స్థానిక వైసిపి నేతలు ఈ మేరకు వినతిపత్రం అందించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని కోరారు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, సబ్బవరపు ఈశ్వరరావు, బోండా గోవిందరాజులు, పాల్గొన్నారు

విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని వెంకటాపురం యుపి పాఠశాలలో 110 మంది విద్యార్థులకు ఆంధ్రబ్యాంకు పూర్వ మేనేజర్ వంతరాం చంద్రమౌళి శుక్రవారం పెన్నులు, పెన్సిళ్లు స్వీట్లు బిస్కెట్లు పంపిణీ చేశారు. తన మనవడు షన్విక్‌సాయి వేదాన్ష్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ఏటాపదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహం, పేద విద్యార్థులకు ఫీజులు, పుస్తకాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య గీతాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రావు వర్మ, రూప, అపరంజి, జయభారతి, నిర్మల, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధిపై చర్చ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గుడిలోవ రంగనాథస్వామి దేవాలయాన్ని దేవస్థానం నూతన ఇఒ నానాజీ సందర్శించారు. దేవాలయంలో మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. ఆలయంలోని సమస్యలను ఇఒకు దేవస్థానం ఛైర్మన్ కోరాడ గిరిరాజు, డైరెక్టర్ చందల అప్పలరాజు వివరించారు. దేవాలయ సమస్యలు అభివృద్ధిపై కమిటీ సభ్యులతో చర్చలు జరిపారు. ముఖ్యంగా వచ్చేనెలలో మహాశివరాత్రి ఏర్పాట్లపై చరించారు. ఆలయ ప్రాంగణంలోరుద్రాభిషేకం నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ధనియాల చంద్రలక్ష్మి, బాలి అప్పలకొండమ్మ ,పిల్ల శ్రీను, కోరాడ రోహిణి, ఈతల పాక అప్పయ్యమ్మ, మజ్జి నాగరాజు పాల్గొన్నారు

ఘనంగా 'హై ఫీల్డ్' వార్షికోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ: హైఫీల్డ్ పాఠశాల నాలుగో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పల్సస్ సిఇఒ. డాక్టర్ జి. శ్రీనుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.. బాలాజీ విద్యాసంస్థల అధ్యక్షులు మండవ రవికుమార్ నిర్వహణకర్తగా వ్యవహరించిన వేడుకలో ప్రణవాలయ నత్య గానాలతో ఆహ్వానిస్తు, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వివిధ రకాల నైపుణ్యాలు, సజనాత్మకత, ఆలోచనాత్మక, కళాత్మక కార్యక్రమాలతో అలరించారు.

దేశానికి వెన్నుముక అయిన రైతు, దేశం కోసం సరిహద్దుల్లో ప్రాణత్యాగం చేసే సైనికుని గురించి, ప్రేమ, మానవత్వం చాటుతూ కళాత్మకంగా నాటికను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మండవ ప్రణీత్, ప్రిన్సిపల్ మారుపూడి పద్మజ, జనరల్ మేనేజర్ జకీఖాన్, వైస్ ప్రిన్సిపాల్ వేదుల రమ పాల్గొన్నారు

గ్రీన్ డేల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -మధురవాడ : గ్రీన్‌డేల్ స్కూల్‌లో శుక్రవారం సాంప్రదదాయబద్ధంగా సంక్రాతి ఉత్సవాలను నిర్వహించారు.పాఠశాలను మామిడి ఆకులు, చెరకులతో అలంకరించారు. గొబ్బెమ్మలు, హరిదాస్ పాటల సందడితో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకకు మరింత వన్నె తెచ్చారు. స్కూల్ ప్రిన్సిపాల్ దివ్య దాస్ ప్రసంగిస్తు భోగి సంక్రాతి ప్రత్యేకతలను వివరించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఛైర్మన్ డాక్టర్ ఎస్.పి.రవీంధ్ర, కరస్పాండెంట్ డాక్టర్‌విజయ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

9న సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార : మెలోడీ క్రియేటర్స్, శృతిలయ, రసరాగ మాధురి సాంస్కృతిక సంస్థల నిర్వహణలో ఈ నెల 9న సాయంత్రం ఆరు గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. శుక్రవారం దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎపిఇపిడిసిఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ బి రమేష్‌ప్రసాద్ సీతమ్మధారలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కళాకారులను ప్రశంసించారు. కార్యక్రమంలో మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షులు సిహెచ్‌వి సత్యనారాయణ, రసరాగ మాధురి అధ్యక్షులు ఎంఎస్ మాధవ్, హేమంత్‌కుమార్ ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మెలోడీ కార్యదర్శి ఎంవి రాజశేఖర్, సాంస్కృతిక రంగ ప్రముఖులు కొణతాల రాజు, ఎస్ఎస్ఎన్.రాజు, ఫణిస్వామి పాల్గొన్నారు. నగరానికి చెందిన గాయకులు విజ ప్రభాకర్,అమ్మాజీరావు గాయనీమణులతో కిషోర్ కుమార్ అలనాడు ఆలపించిన హిందీ గీతాలను ఆలపిస్తారని నిర్వాహకులు తెలిపారు. కళాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సిఐటియు డైరీ ఆవిష్కరణ



షిప్‌యార్డు సిఐటియు డైరీని ఆవిష్కరిస్తున్న రమణమూర్తి

ప్రజాశక్తి -ములగాడ : హిందుస్థాన్ షిప్‌యార్డ్, సిఐటియు కార్యాలయంలో యూనియన్ రూపొందించిన పోకెట్ డైరీని గుర్తింపు యూనియన్ జనరల్ సెక్రటరీ ఎంవి. రమణమూర్తి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఈ డైరీలో ఉద్యోగులకు ఉపయోగకరమైన పలు జిఒలు, సెలవులు, ఇతరత్రా సమాచారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఆఫీసు బేరర్స్, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఎఫ్ఎపిటిఒ జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ నాగేశ్వరరావు



దాసరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఎఫ్ఎపిటిఒ) విశాఖపట్నం జిల్లా డిప్యూటీ సెక్రెటరీ జనరల్‌గా దాసరి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆయన మండలంలోని బోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారా సమస్యల పరిష్కారం సాధ్యమౌతుందన్నారు. నాగేశ్వరరావు ఎంపికపై యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాన అప్పారావు, జిల్లా కోశాధికారి టి.ఆర్.అంబేడ్కర్, జిల్లా నాయకులు వై.భాస్కర్, ఆనందపురం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిరణ్ కుమార్, రామసత్య హర్షం వ్యక్తం చేశారు.

13వ వార్డులో గడప గడపకూ...



గడపగడపలో పాల్గొన్న విజయనిర్మల, సునీత

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పాల్గొని, ఆరిలోవ కాలనీ, ఎర్ని దుర్గానగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

శాశ్వత ప్రాతిపదికన ఒసిఎం నియామకాలు చేపట్టాలి

-స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన ధర్నా, వినతి



వినతిపత్రం అందజేస్తున్న స్టీల్ సిఐటియు నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ ఎఫ్ఎండి విభాగంలో శాశ్వత ఒసిఎం నియామకం చేయాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఎఫ్ఎండి విభాగంలో స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, విభాగాధిపతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నా నుద్దేశించి స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఎఫ్ఎండి విభాగంలో శాశ్వత ప్రాతిపదికన ఒసిఎం నియామకాలు జరుపుకుండా, కాంట్రాక్ట్ విధానం ద్వారా నియామకం చేయాలని గతేడాది డిసెంబర్ 7న యాజమాన్యం టెండర్ పిలిచిందని, దీన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో నియామకం జరిపితే ప్రాణ నష్టంతో పాటు, ఆస్తి నష్టానికి ఆస్కారం ఉంటుందని, ఇటువంటి చర్యలకు యాజమాన్యం పూనుకోవడం అత్యంత ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్, విభాగం సిఐటియు ప్రతినిధులు ఎన్ఎస్ఎస్ నాయుడు, సిహెచ్ వెంకట రావు, పిజికె నూకరాజు, ఎజెఆర్ శేషు, పి శ్రీనివాస్, నాగభూషణం, శ్యామలరావు, వి నారాయణమూర్తి, వి.రామారావు, స్టీల్ సిఐటియు నాయకులు శ్రీనివాసరాజు, గంగాధర్, నీలకంఠం, కె సత్యనారాయణ, శ్రీనివాసులు రెడ్డి తదితరులతోపాటు విభాగం కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

మురుగునీరు మళ్లించాలని టిడిపి ఆందోళన



సర్వీస్ రోడ్డు వద్ద టిడిపి ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి -తగరపువలస : సంగివలస కొండప్ప చెరువును ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డుపై నెలల తరబడి నిలిచిన మురుగు నీటిని మళ్లించాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం టిడిపి నగర కార్యదర్శి పిట్టా సురేష్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, సర్వీసురోడ్డుపై ఏనాడో కురిసిన వర్షపునీరు నేటికి నిలిచి ఉండడంతో స్థానిక అల్లూరి సీతారామరాజు కాలనీ, సబ్బి వారి కల్లాల వాసులతోపాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాళ్లంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై అనేకమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఎటువంటి స్పందన లేదని ఆరోపించారు. తగరపువలసలోని అనేక ప్రాంతాల్లో అశాస్త్రీయంగా రోడ్లు, కాల్వల నిర్మాణంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచి, ప్రజలు రోగాలబారిన పడుతున్నా అధికారుల్లో కదలిక లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 1,2 వార్డుల టిడిపి అధ్యక్షులు టి సూరిబాబు, బడిగింటి నీలకంఠం, పార్టీ నేతలు వానపల్లి సత్య, చోడిపల్లి సాయికుమార్, గణేష్, జోగ సన్యాసిరావు, గిడుతూరి శ్రీనివాసరావు , మద్దిల సుబ్బారావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తెండి

మాజీ మంత్రి బండారు



కల్యాణమండపం దుస్థితి పరిశీలిస్తున్న టిడిపి నేతల బృందం

ప్రజాశక్తి- పెందుర్తి :అన్ని సౌకర్యాలతో సుందరంగా రూపొందినప్పటికీ, టిడిపి హయాంలో నిర్మాణం జరిగిందన్న సాకులే మూడేళ్లుగా అతీగతీ లేకుండా వదిలేసిన 97వ వార్డు వుడాకాలనీలోని కల్యాణమండపాన్ని వినియోగంలోకి తేవాలని టిడిపి నేతలు కోరారు. శుక్రవారం మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి నేతృత్వంలోని టిడిపి నేతల బృందం వుడా కాలనీలోని కల్యాణమండపాన్ని సందర్శించింది. ఈ సందర్భంగ మాజీ మంత్రి బండారు మాట్లాడుతూ, టిడిపి ప్రభుత్వహయాంలో నిర్మాణం జరుపుకోవడం తప్ప మరే కారణంలేని వుడాకాలనీ కల్యాణమండపంపై ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడాలని కోరారు. రంగులు, పేర్లు మార్చడం తప్ప, కొత్తగా చేయడం చేతకాని వైసిపి ప్రభుత్వం, వుడకాలనీలోని కల్యాణమండపానికి నచ్చిన పేరుపెట్టుకుని అయినా వినియోగంలోకి తేవాలని ఎద్దేవా చేశారు. చుట్టుపక్కల కాలనీలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కల్యాణమండపాన్ని వినియోగంలోకి తెస్తే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఐటన్ నొక్కే ఆనవాయితీని కొనసాగించి, స్థానిక ఎమ్మెల్యేదీన్ని వినియోగంలోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శానాపతి శంకరరావు, ఆవగడ్డ అప్పలనాయుడు కరక దేవుడు, బల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఇళ్ల నిర్మాణాలు, మరమ్మతులపై దాడులు ఆపకుంటే ప్రతిఘటన

ప్రజాశక్తి- సింహాచలం: ఘాట్‌రోడ్డు సమీపంలోని ఒక ఇంటి వాకిలిని మరమ్మతు చేస్తుంటే సింహాచల దేవస్థానం సిబ్బంది గునపాలతో వచ్చి తవ్వేయడం తోపాటు దౌర్జన్యకరంగా వ్యవహరించి, భయాందోళనకు గురిచేయడం దారుణమ సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బి వెంకటరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సింహాచలం పంచ గ్రామాల భూసమస్యను వైసిపి ప్రభుత్వం పరిష్కారానికి ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంతోపాటు ఏళ్ల తరబడి జాప్యం జరుగుతుండడంతో సింహాచలంతో పాటు వేపగుంట, వెంకటాపురం, చీమలపల్లి, పురుషోత్త పురం గ్రామాలతోపాటు హనుమంతువాక, గోపాల పట్నం, ఇందిరానగర్, లక్ష్మీ నగర్ కొండవాలు ప్రాంతాల్లోని ఇళ్లు ఏళ్లతరబడి శిథిలావస్థకు చేరుకున్నా అవస్థలు పడుతూ వాటిల్లో జీవనం సాగించాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వీటికి మరమ్మతులు చేసుకోవాలని దేవస్థానానికి ఎన్నోసార్లు దరఖాస్తులు పెట్టుకున్నా తిరస్కరించడంతోపాటు ఎవరైనా రిపేర్లు చేసుకుంటే దౌర్జన్యం చేస్తూ కూలదోస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా హామీనిచ్చి అమలు చేయని అధికార వైసిపి ప్రభుత్వం, నేతలు చూసీ చూడనట్టు వ్యవహరిస్తూ, కపట నాటకమాడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ఇంట్లో నిర్మాణంపై దేవస్థానం సిబ్బంది చేసిన దాడులను ఆపాలని కోరారు. లేకుంటే పెద్ద సిపిఎం ఆధ్వర్యాన ప్రతిఘటించక తప్పదని హెచ్చరించారు

నాణ్యమైన ఉచిత వైద్యం లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి రజని

ప్రజాశక్తి- గాజువాక : ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలన్నదే సిఎం జగన్ లక్ష్యమనిరాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని అన్నారు. శుక్రవారం 64వ వార్డు, గంగవరంలో రూ.1.05కోట్ల ఎన్‌యుహెచ్ఎం నిధులతో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి రజని మాట్లాడుతూ, పేదల ఇంటివద్దకే మెరుగైన వైద్యం అందించాలని ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో 42 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటును సంకల్పించి, ఇప్పటివరకు 38 నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించామన్నారు. నిర్మాణ దశలో ఉన్న నాలుగింటని త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, గంగవరం పోర్టు కోసం భూములిచ్చి, పోర్టులోనే కూలీలుగా పనిచేస్తున్న నిర్వాసితులకు వేతనాలు పెంచాలని, అలాగే కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరారు.దీనిపై మంత్రి స్పందించి, సిఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేద్దామన్నారు. డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలపై వినతి



మంత్రి విడదల రజనికి వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- గాజువాక : గంగవరం పోర్టు నిర్వాసిత మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం స్టీల్ జోన్ నాయకులు కోవిరి అప్పలరాజు, కంబాల మహేష్ కోరారు. శుక్రవారం గంగవరంలో ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి వచ్చిన రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గంగవరం పోర్టు కాలుష్యంతో నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని, గంగవరం గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. 2019 ఎన్నికల్లో గంగవరం గ్రామాన్ని తరలిస్తానని స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గంగవరం మత్స్యకారుల చేపల వేటకు వీలుగా నల్లమారం పాదాల వద్ద ఫిషింగ్ జెట్టీ నిర్మించాలని కోరారు. పోర్టు నిర్వాసిత నాలుగు గ్రామాల ప్రజలకు పెండింగ్ జీవనభృతి ప్యాకేజీ ఇప్పించాలని కోరారు.. గంగవరం గ్రామానికి శ్మశానవాటిక స్థలం కేటాయించి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

సెల్ టవర్లు నిర్మించొద్దని నిరసన

ప్రజాశక్తి- పెందుర్తి : సెల్‌టవర్లు నిర్మించొద్దని97వ వార్డు వుడా కాలనీవాసులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విన్నకోట రాము మాట్లాడుతూ జనావాసాల మధ్య సెలటవర్ల ఏర్పాటుతో రేడియేషన్ వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తమౌతున్న నేపథ్యంలో ప్రజాభిప్రాయాన్ని గౌరవించి సెల్‌టవర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. దీనిపై గతంలో రెండుసార్లు ధర్నాలు చేశారన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు కెవి ప్రసాదరావు నాగభూషణ్, కిషోర్, ఆదిలక్ష్మి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు



ఆందోళనలో పాల్గొన్న 8 గ్రామాల నిర్వాసితులు

68వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఒబి ఎనిమిది గ్రామాలకు చెందిన నిర్వాసితులు వాడనర్సాపురం సమీపంలో నేవీ గేటు ముందు చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి 68వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ రెండు నెలలకు పైగా ఉపాధి లేక అనేకమైన ఇబ్బందులు పడుతున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించి పెండింగ్ ప్యాకేజీలు చెల్లించాలని, జెట్టీ నిర్మాణం చేపట్టాలని, అప్పటి వరకు ఆధార్ ఆధారంగా నేవీ గేట్ నుండి చేపల వేటకు అనుమతి ఇవ్వాలని కోరారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీలను, తమతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బౌద్ధ మేళా కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రసిద్ధ బౌద్ధ ఆరామ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద ఈనెల 16న విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న బౌద్ధ మేళకు సంబంధించి కరపత్రాన్ని స్థానిక పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి ఎంపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రచార కన్వీనర్ బల్ల నాగభూషణం మాట్లాడుతూ ప్రతి ఏటా కనుమ పండుగ రోజు నిర్వహించే ఈ బౌద్ధ మేళాకు దేశ విదేశాల నుంచి బౌద్ధ భిక్షువులు హాజరు కావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది బర్మా దేశానికి చెందిన బౌద్ధ భిక్షువు అయిపాల మహాథేరో, శ్రీలంక బౌద్ధ బిక్షువు బోధిహిం భాంతేజీ తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు బుద్ధుని ప్రధాన గుహలో ప్రత్యేక పూజలు, ర్యాలీలు, శాంతి సందేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షులు మాటూరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు గొంది నవీన్, విన్నకోట నీలేష్ గుప్త, అల్లాడ శ్రీనివాసరావు, ఆర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి తదితరులు

క్వారీలతో మా గ్రామానికి ముప్పు

- మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ జరపండి
- స్పష్టం చేసిన బవులవాడ గ్రామస్తులు



ప్రజాభిప్రాయ సేకరణలో ప్రశ్నిస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-అనకాపల్లి

క్వారీల వల్ల తమ గ్రామానికి పెద్ద ఎత్తున ముప్పు వాటిల్లుతుందని మండలంలోని బలువాడ గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేశారు. బవులవాడ పంచాయతీ త్రిమూర్తులు గుడి సమీపంలో శుక్రవారం అధికారులు క్వారీ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. సర్వే నెంబర్ 75లో మూడు హెక్టార్లకు గాను సిహెచ్ మహాలక్ష్మి నాయుడు క్వారీ అనుమతులకు దరఖాస్తు చేసుకున్నారు. డిఆర్ఓ వెంకటరమణ అధ్యక్షతన జిల్లా పొల్యూషన్ అధికారి, భూగర్భ గనుల శాఖ అధికారులు పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. తమ గ్రామానికి చెందిన కొండల నుంచి క్వారీ తరలించకపోతున్నారు గాని గ్రామానికి కావలసిన కనీస సదుపాయాలు కల్పించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పబ్లిక్ హియరింగ్ గురించి కనీసం ప్రజలకు తెలియదని, మరోసారి పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఫ్యాప్టో జిల్లా కార్యవర్గం ఎన్నిక

చైర్మన్, ప్రధాన కార్యదర్శులుగా చిన్నబ్బాయి, సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్




చిన్నబ్బాయి, సుధాకర్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా ఈ ఎన్నిక జరిగింది. ఫ్యాప్టో జిల్లా చైర్మన్‌గా గొంది చిన్నబ్బాయి (యుటిఎఫ్), ప్రధాన కార్యదర్శిగా వై.సుధాకర్ (ఎస్టీ ఎస్టీయుఎస్), డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా ఎన్ సన్యాసినాయుడు, ఎంజె,సావియర్, ఎం.శ్రీనివాసులు, కోశాధికారిగా పరదేశి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులుగా వి శ్రీలక్ష్మి (యుటిఎఫ్), ప్రేమ్ కుమార్ (ఎస్‌టియు), వెంకట సూర్యనారాయణ, పి.సత్యనారాయణ, ఎవిహెచ్ శాస్త్రి ఎన్నికయ్యారు.

11న రామ్మూర్తి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : పీడిత ప్రజల హక్కుల సాధనకై తన గొంతును వినిపించిన బహుజన కళా యోధుడు గొల్ల రామ్మూర్తి విగ్రహావిష్కరణ, ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆయన స్వగ్రామం విజయనగరం జిల్లా, లక్కవరపుకోట మండలం, పోతంపేటలో ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు బహుజన కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.ఉదయభాస్కర్, ఉపాధ్యక్షులు కాటపల్లి అప్పారావు తెలిపారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో శుక్రవారం ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, బుద్ధుడు, అంబేద్కర్ ఆశయాల కోసం అహర్నిశలు పనిచేస్తూ గతేడాది జనవరి 11న రోడ్డు ప్రమాదానికి గురై రామ్మూర్తి మృతి చెందారని తెలిపారు. 11న జరుగు కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి అభిమానులు, కళాకారులు, బహుజన ఉద్యమ నేతలు హాజరుకానున్నారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కొమ్మనపల్లి జేసుదాస్, బొత్స ఎరకయ్య, పాల్తేటి అప్పారావు పాల్గొన్నారు.



మద్యం మానేసిన వారికి బహుమతులు అందజేస్తున్న జెసి

మద్యం మానేయడం శుభపరిణామం

- జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి

ప్రజాశక్తి-మునగపాక రూరల్

మద్యం మహమ్మారి కబంధహస్తాల్లో ఎన్నో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో విముక్తి ప్రాజెక్టు ద్వారా మద్యం తాగడం పూర్తిగా మానేయడం శుభపరిణామమని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మద్యం తాగడం పూర్తిగా మానేసిన మండలంలోని 11 గ్రామాలకు చెందిన 17 మందిని జెసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇంతటితో ఆగకుండా నిరంతరం కొనసాగాలన్నారు. మునగపాకను ఆదర్శంగా తీసుకొని ఇతర మండలాలకు ఈ ప్రాజెక్ట్ విస్తరించాలన్నారు. ఈ పరివర్తన ప్రతి కుటుంబాలలో ఉన్న వ్యసనపరులకు మార్గదర్శకం కావాలని సూచించారు. వ్యసనపరులలో మార్పుకు కృషి చేసిన ఏఎన్ఎం, ఆశ, మహిళ పోలీస్, గ్రామస్థాయి ఉద్యోగులు, మండస్థాయి అధికారులను ఆమె అభినందించారు. అనంతరం ఎంపీపీ మళ్ల జయలక్ష్మి సమకూర్చిన బహుమతులను మద్యాన్ని విరమించిన వారితో పాటుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, తహశీల్దారు బాబ్జి, ఈవోపీఆర్‌డి పి.ఈశ్వరరావు, వైసీపీ మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, మునగపాక, చూచుకొండ పిహెచ్‌సిల వైద్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

స్మైలెక్స్ ఫార్మాలో ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ ఫార్మాలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ పరిశ్రమలో కార్మికులు గతంలో ఇద్దరు, ఇప్పుడు ఒక మృతి చెందారని తెలిపారు. యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వారు దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ పరిశ్రమలో పిఎఫ్ , ఈఎస్ఐ సొమ్ము రూ.54 లక్షల కార్మికుల డబ్బులు కాంట్రాక్టరు మింగేశారని తెలిపారు. ఇప్పటికైనా పరిశ్రమలో భద్రతా ప్రమాణాలపై అధికారులు భద్రత ఆడిట్ నిర్వహించాలని గనిశెట్టి కోరారు.

సింహాద్రి కాలేజీలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక సింహాద్రి ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, త్రో బాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముందస్తుగా భోగి మంటలు వెలిగించి పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు జివివి సత్యనారాయణ మూర్తి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు పది రోజుల ముందు వరకు

ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న జెసి కల్పనాకుమారి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పది రోజుల ముందు వరకు ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చని, అందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జెసి కల్పనా కుమారి కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా డి.నోవో తయారీకి సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా రోల్ కోసం ఉద్దేశించిన ఎన్నికలకు నామినేషన్లు పూరించడానికి చివరి తేదీ వరకు నిరంతర నవీకరణ జరగాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా సీఈఓ ఆఫీస్ వెబ్సైట్ www.ceoandhra.nic.in లో అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, వైసిపి నాయకులు బొడ్డేడ సూర్యనారాయణ, టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, బిజెపి నాయకులు సూరిశెట్టి భాస్కరరావు, సిపిఎం నాయకులు ఆర్.శంకరరావు, వివి.శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు వైస్ భద్రం, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు పాల్గొన్నారు.


హారికను అభినందిస్తున్న జెసి కల్పనాకుమారి

రాష్ట్ర ఉత్తమ వైద్యాధికారిగా హారిక

ప్రజాశక్తి- దేవరాపల్లి : గ్రామాలలో ఉత్తమ వైద్య సేవలు అందించినందుకు గాను దేవరాపల్లి మండలం, వేచలం పిహెచ్‌సి వైద్యాధికారి బి.హారికకు రాష్ట్ర ఉత్తమ వైద్యాధికారి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా శుక్రవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి హారికను అభినందించారు. అనంతరం హారిక మాట్లాడుతూ, పీహెచ్సీ పరిధిలో తారువ, పెదనందిపల్లి, గ్రామాలలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలో భాగంగా ఈ అవార్డు దక్కిందని తెలిపారు. ఈ విషయమై ఆమెకు అభినందనలు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తెనుగుపూడిలో చెరుకు కాటా ఏర్పాటు

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో మండలంలోని తెనుగుపూడి గ్రామంలో చెరుకు కాటా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత రైతులు విజ్ఞప్తి మేరకు డిప్యూటీ సీఎం బూడి జిల్లా కలెక్టర్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి వి.సన్యాసినాయుడు, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఈ మేరకు సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి సమక్షంలో కాటా ఏర్పాటు పనులను శుక్రవారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబూరావు, ఉప సర్పంచ్ కాటిపాము పెదనాయుడు, రైతులు పాల్గొన్నారు.

బిసిల ద్రోహి జగన్ : నాగజగదీశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : బీసీలను కాపాడుతామని 2019 ఎన్నికల్లో హామీలు ఇచ్చి గంప గుత్తిగా వారి ఓట్లు కాజేసిన జగన్ రెడ్డి బీసీ కార్పొరేషన్ నిధులను దారి మళ్లించి వారికి అన్యాయం చేశారని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం అనకాపల్లి జిల్లా నియోజకవర్గాల బీసీ సెల్, బీసీ సాధికారత సమితి కమిటీల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బీసీలకు కేటాయించిన రూ.12 వేల కోట్లు జగన్‌రెడ్డి దారి మళ్లించి తన నవరత్నాల పథకాలకు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. తాను ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు కనీసం కుర్చీలు ఏర్పాటు చేసే అవకాశం కూడా లేకుండా చేశారన్నారు. రాజ్యాంగపరంగా బీసీలకు దక్కవలసిన 16,400 స్థానిక సంస్థల పదవులు రాకుండా బీసీల ద్రోహిగా మారారని విమర్శించారు. ఈ సమావేశంలో టిడిపి నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు బత్తుల తాతయ్య బాబు, పివిజి కుమార్, టిడిపి నాయకులు బండారు అప్పలనాయుడు, బిసి సాధికార సమితి, బిసి సెల్ నాయకులు మళ్ల సురేంద్ర, గింజల లక్ష్మణరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, నీలబాబు, తమ్మిన విజయ్ కుమార్, ఆర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

రవికి పవన్ కల్యాణ్ అభినందన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది చెందిన రచయిత మాకాల రవిని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. రవి జనసేన, పవన్ కళ్యాణ్ సేవా కార్యక్రమాలపై దండకం రచించారు. జనసేనకు పలు స్లోగన్స్ కూడా రూపొందించారు. ఈ నేపథ్యంలో రవి రచనలను సోషల్ మీడియా ద్వారా చూసి పవన్ స్పందించారు. రవిని శుక్రవారం హైదరాబాదులోని తన స్వగృహానికి పిలిపించుకుని హత్తుకుని అభినందించారు. పవన్ అభినందనలపై మాకాల రవి సంతోషం వ్యక్తం చేశారు.

పండగలకు పోలీసు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలో సంక్రాంతి, అనంతరం గ్రామాల్లో నిర్వహించే తీర్థాలు, పండుగలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ డి.నాగేంద్ర అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తీర్థాలు, పండుల సందర్భంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదని, కోడి పందాలు, గుల్లాట, బల్లాట, మరే ఇతర జూదాలు నిర్వహించిన చట్టపరమైన కేసులు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో నిర్వహించే డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలకు తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్ అనుమతి ఉండాలని, లేనిపక్షంలో చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని చెప్పారు. పై విషయాలను అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల పెద్దలు, యువకులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

మండల సమావేశంలో నిలదీతలు

బడ్జెట్ ఆమోదం


బడ్జెట్ వివరాలు తెలియజేస్తున్న ఎఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ధాన్యం తేమశాతం ఎక్కువగా ఉందని చెప్పి వరి ధాన్యం కొనుగోలులో అధికారులు తరుగు పేరుతో అధికంగా తగ్గిస్తున్నారని, దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో సభ్యులు కొల్లిమల అచ్చంనాయుడు, దొండ నారాయణ మూర్తి వ్యవసాయ శాఖ అధికారులకు నిలదీశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలపై అధికార పార్టీ సభ్యులే నిలదీశారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో ఎక్కువగా తగ్గిస్తున్నారని సభ్యుల ప్రశ్నకు మండల వ్యవసాయాధికారి భాస్కరరావు సమాధానం ఇస్తూ ధాన్యం కొనుగోలులో తేమ తగ్గింపు సమస్యను జిల్లా అధికారులకు తెలియజేస్తామని చెప్పారు. పోలేపల్లిలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, ఆ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని, నిధులు విడుదల అయ్యాయని చెబుతున్నారే తప్ప పనులకు సంబంధించిన పురోగతి లేదని సర్పంచ్ సీత బుజ్జి తెలిపారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హరీష్ మాట్లాడుతూ తాగునీటి పథకానికి సంబంధించిన ప్రతిపాదనలు స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పంపించడం జరిగిందని చెప్పారు. తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్స్‌ను బదిలీ చేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పిఎసిఎస్ అధ్యక్షులు కోరుకొండ అప్పలనాయుడు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఎన్ఆర్ఇజిఎస్‌లో భాగంగా రూ.33 లక్షలతో కందిపూడి గ్రామంలో కాలువలు నిర్మాణం ప్రారంభించారని, పనులు పూర్తి చేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై గ్రామస్తులు తనను నిలదీస్తున్నారని సర్పంచ్ కుమారుడు కొప్పాక గణేష్ అధికారులు దృష్టికి తీసుకువచ్చాడు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరీష్ మాట్లాడుతూ మిగిలిన పనులు చేపట్టడానికి నూతన ప్రతిపాదనలు పంపించాలని కోరారు. అనంతరం వచ్చే ఏడాదికి సంబంధించిన మండల బడ్జెట్‌పై చర్చించి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి దొండ రాంబాబు, వైస్ ఎంపీపీ నారాయణమూర్తి, ఎంపీడీవో సువర్ణ రాజు, వివిధ శాఖల అధికారులు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతు నొక్కేందుకే చీకటి జిఒ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే గొంతులను అణగదొక్కేందుకు వైసిపి ప్రభుత్వం చీకటి జిఒ జారీ చేసిందని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆరోపించారు. గురువారం రాత్రి మండలంలోని చింతలపూడి పంచాయితీ శివారు కొరాడ గ్రామంలో టిడిపి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ, వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం గవిరెడ్డి మాట్లాడుతూ, ఈ చీకటి జీవోలతో లోకేష్ పాదయాత్రను అడ్డుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మలిరెడ్డి రాజునాయుడు, టిడిపి నాయకులు బి.సింహాద్రప్పుడు, కోరుప్రోలు రామలింగేశ్వర స్వామి, పైడిరాజు, ముసలి తమ్మయ్య, డాయిరి దేముడు, డాయిరి మల్లేష్, లక్ష్మణరావు, ముక్క ఈశ్వరరావు, వంతు నాయుడు పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోట మూడో రోజు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే తొలగించిన పింఛన్లను పునరుద్ధరిస్తామని చెప్పారు. కాపుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్, జగన్నాథం, పంచదార్ల సూరిబాబు, వేగి వెంకటరావు, కొంటెం ఈశ్వరమ్మ, ఎంపీటీసిలు బుద్దిరెడ్డి అప్పుడు, షేక్ దర్గా పాల్గొన్నారు.


రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న ఎపిఎం శ్రీనివాసరావు

రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జమ్మదులపాలెం గ్రామంలో రక్తహీనతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి మాట్లాడుతూ 11 నుండి 18 సంవత్సరాల లోపు కిశోర బాలికలకు, గర్భిణులు, బాలింతలకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా దొరికే మునగ ఆకు, రాగిపిండి, పండ్లు, గుడ్లు, ఆకు కూరలు, కూరగాయలు వంటివి ఆహారంగా తీసుకుంటే మంచి పౌష్టికాహారం అంది రక్తహీనత నుంచి బయటపడవచ్చని తెలిపారు. గ్రామాల్లో రక్తహీనత తగ్గే వరకు ఎఎన్ఎంలు, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎం.శ్రీనివాసరావు, ఎంపిటిసి గూడువు వరలక్ష్మి, పి.తలుపులమ్మ సీసీ రామకృష్ణ, విఓఏ కుమారి పాల్గొన్నారు. మండలంలోని త్యాగాడ గ్రామంలోనూ అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక భీముని గుమ్మం రామాలయంలో శుక్రవారం ఆయుష్ ఆధ్వర్యాన ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయుర్వేద వైద్యం, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యురాలు కె.లావణ్య మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్సీ సెల్ లీడర్ కటారి దేముడు, పి రాజు, డి.కనకారావు, బి.నూకరాజు, బి.అప్పారావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-చోడవరం : ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ బుచ్చయ్యపేట మండలం కొండపాలెంలో ఎంవిఆర్ చిత్ర పటానికి శుక్రవారం ఆ గ్రామస్తులు పాలాభిషేకం, పూలాభిషేకం చేశారు. కొండపాలెం గ్రామ సర్పంచ్ ముచ్చకర్ల భవాని వెంకటస్వామి నాయుడు (తాతయ్యలు) ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంవీఆర్ టీమ్ సభ్యులు కరణం శ్రీనివాస్, చెక్కలన్న, గాలి శ్రీనివాస్, పల్లా వరహామూర్తి, తురకల పూడి నాయుడు, యువసేన సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఎంవిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'


వృద్ధులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని మేడిచర్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిచర్ల సచివాలయం పరిధిలోని గ్రామాలకు జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదనపు నీటి అవసరాల కోసం 3 వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామంలో అర్హులైన వారికి జగనన్న గృహాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం కొన్ని గ్రామాలకు కలిపే బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్ మోహన్, లంకవానిపాలెం సర్పంచ్ దొరబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్బవరం : ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. మండలంలోని వంగలి పంచాయతీలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామానికి కావలసిన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపిపిలు శరగడం ఝాన్సీలక్ష్మిరాణి, చొక్కాకుల గోవింద, ఎంపీటీసీ గవర తులసి రాజు, వైసిపి నాయకులు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, సబ్బవరపు ముత్యాల నాయుడు, కోటన రాము, కోటిని అమ్మతల్లి నాయుడు, ఎర్ర శ్రీనివాసరావు, జెట్టి హేమంత్ కుమార్, వడ్డాది అప్పల రాజు, సాలాపు వెంకటేశ్వరరావు, కర్రి బాబు, ఎంపిడిఒ రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని రామన్నపాలెం, మోసయ్యపేట గ్రామాల్లో యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు వృద్ధులు, మహిళలను పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పింఛన్లు పంపిణీ చేశారు. మోసయ్యపేటలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార వర్మ, సర్పంచు పంచదారల పైడిరాజు, ఎంపీటీసీ లాలం శ్రీను, రాజాన పైడి భాస్కరరావు, జడ్పీటీసీ రాంబాబు, వైసిపి నాయకులు కోన బుజ్జి, కె.విమలా నాయుడు, ఒడిసెల శ్రీనివాసరావు, దేశంశెట్టి శంకర్రావు పాల్గొన్నారు.

పథకాలు శత శాతం అమలుకు కృషి

చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి -రావికమతం: ఎన్నికల వాగ్దానాలను, మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను నూటికి నూరు శాతం అమలు చేయడమే ద్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ తెలిపారు. మండలంలో గుడివాడ పంచాయతీ మొట్టవానిపాలెం, గుడివాడ గ్రామాలలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ సక్రమంగా అందుతున్నవీ లేనిది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధర్మ శ్రీ మాట్లాడుతూ, అర్హులైన వారు ఏ ఒక్కరు కూడా మిగిలి ఉండకూడదని ఆయన తెలిపారు. పార్టీలకు, కులాలకు, మతాలకు, వర్గాలకు, అతీతంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజలకు అందే విధంగా చూడాలని మండల స్థాయి అధికారులకు, వాలంటీర్లకు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని పథకాలు మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని అన్నారు. గత రెండేళ్ల కరోనాతో ఆర్థికంగా రాష్ట్రం అనేక విధాలుగా సతమతమయినప్పటికీ ఎప్పుడూ వెనుకడుగు వేయకుండా సంక్షేమ పథకాలను యధావిధిగా అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలన్నీ చంద్రబాబు ఐదు సంవత్సరాల పరిపాలనలో ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితి ఆ రోజు ఈ రోజు ఒకటే కదా అని తెలిపారు. ప్రజలకు మేలు చేసే ఆలోచన చంద్రబాబుకు ఎప్పుడూ లేదని, ఎన్నడూ ఉండదని ఆయన విమర్శించారు. ఆనాడు రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, జగన్మోహన్ రెడ్డి హయాంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉన్నారని తెలిపారు. గుడివాడ గ్రామ పంచాయతీకి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.8 లక్షలు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా 15 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలరాజు, మండల ఆగ్రో అడ్వైజరీ కమిటీ చైర్మన్, మండల పార్టీ నాయకులు కంచిపాటి జగన్నాధరావు, సర్పంచ్ గుమ్మాల శంకర్రావు, ఎంపీటీసీ అప్పారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ధర్మశ్రీ

అర్హులకు పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: అర్హులైన ప్రతీ ఒక్కరికి పెన్షన్లు మంజూరు చేశామని పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబురావు తెలిపారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపురం సచివాలయ పరిధిలోని గోకులపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, నవరత్నాలలో భాగంగా ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు వర్తింపచేస్తున్నామని, పెన్షన్లు, పక్కా ఇళ్ళు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నూకి నాయుడు, బాబ్జి, శ్రీను, స్థానిక అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సహా

11 మందిపై అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉద్దండపురం గ్రామా నికి చెందిన 12 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నక్కపల్లి పోలీసులు నమోదు చేశారు. ఈ నెల 3న గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ పేకేటి రాజారావు దళితులను కించపరుస్తూ మాట్లాడారని, 4న కూడా దూషిస్తూ మాట్లాడారని ఈ గ్రామానికి చెందిన పులిమార్తమ్మ, పల్లి నూకరత్నంలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదో తేదీన ఎస్ఐ సమక్షంలో రెండు వర్గాలకు చెందిన వారితో మాట్లాడుతుండగా, తమపై పేకేటి రాజారావు వర్గీయులు దాడి చేసి గాయపర్చారంటూ పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ పేకేటి రాజారావుతో పాటు మరో 11 మందిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నక్కపల్లి పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న రమణమ్మ

పోషక విలువలపై అవగాహన

ప్రజాశక్తి-నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు పోషకాహార విలువలపై ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐసీటీసీ కౌన్సిలర్ రమణమ్మ మాట్లాడుతూ, ఏ పదార్థాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయో తెలిపారు. పోషక పదార్థాలున్న ఆహారం తినకపోతే కలిగే ఇబ్బందులు, రక్తహీనతపై వివరించారు. 10 నుంచి 19ఏళ్ల మధ్య వయసున్న విద్యార్థులు ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె శైలజ, ఎన్ఎస్ఎస్ పీవో వి.అప్పారావు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 8 నుంచి

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

ప్రజాశక్తి-రోలుగుంట: ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రోలుగుంటలో గౌరీపరమేశ్వర మహోత్సవాలు నిర్వహించనున్నామని రోలుగుంట ఎంపిటిసి సుర్ల రామకృష్ణ పేర్కొన్నారు. స్టేజి ప్రోగ్రాములు, నేల డ్యాన్సలు, కోలాటాలు, భారీ విద్యుత్ అలంకరణ, భారీ బాణాసంచాతో అతి వైభవంగా నిర్వహిస్తామన్నారు.



తనిఖీలు చేస్తున్న ఆర్‌డిఒ

ఆర్‌డిఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పట్టణంలో పలు పెట్రోల్ బంకులను ఆర్‌డిఒ భవాని శంకర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఫిల్లింగ్ మిషన్ పనితీరు, ఆయిల్ నాణ్యత, మౌలిక సదుపాయాలు పరిశీలించారు. సుమారు రెండు గంటల పాటు నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో ఉన్న పెట్రోల్ బంకులను తనిఖీలు నిర్వహించారు. స్పందన ఫిర్యాదుల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ తెలిపారు. నాణ్యత శాస్త్రీయంగా పరిశీలించి యజమానులకు సూచనలు చేశారు. భవిష్యత్తులో మళ్లీ ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఆయనతో పాటు తహాశీల్దార్ రమణ, అధికారులు ఉన్నారు.

బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ ర్యాలీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రావికమతం, తోటపూడి , ఎస్ఆర్ పేట తదితర ప్రాంతాలకు సకాలంలో బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ సభ్యులు, విద్యార్థులు ర్యాలీగా వచ్చి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు గీతాకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ, ఉదయం, సాయంత్రం బస్సులు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని కోరారు. మేనేజర్ స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శేఖర్, సిద్ధార్థ ధర్మేంద్ర, తారక్, రాజేష్ పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

సస్యరక్షణ చర్యలు పాటించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : అపరాలను సాగు చేసే రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖాధికారి ఉమాప్రసాద్ సూచించారు. మండలంలోని శుక్రవారం కాగిత, చినదొడ్డిగల్లు గ్రామాల్లో అపరాల సాగుపై క్షేత్ర పర్యటన చేశారు. మినుము, పెసర పంటల్లో పురుగు సోకినట్టు గుర్తించారు. నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వరి నూర్పు ప్రక్రియను పరిశీలించారు.

పరిసరాల పరిశుభ్రత కీలకం



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీ ఎస్సీ కాలనీ, పాతవీధిలో పీహెచ్‌సి వైద్యులు ప్రవీణ్, హెచ్ఈ పార్వతమ్మ, సూపర్‌వైజర్ మహాలక్ష్మీ శుక్రవారం పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్ పెదపూడి శివ సత్యనారాయణ, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రై డే

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం పి.హెచ్.సి పరిధిలోని 10 గ్రామ సచివాలయాల్లో ఫ్రై డే డ్రైడేను మెడికల్ ఆఫీసర్లు కావ్య, తులసి నవీన నిర్వహించారు. దోమల వృద్ధిని అరికట్టాలని సూచంచారు. టైర్లు, ఫ్రిడ్జ్ తొట్టెలు, ఎయిర్ కూలర్లు, కొబ్బరి బొండాలు, సిమెంట్ గోళాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు.



కుండీలో నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న ఎపిఎం

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి -మాకవరపాలెం: రక్తహీనత నివారణకు పౌష్టిక ఆహారం తీసుకోవాలని. ఏపీఎమ్ చినబాబు తెలిపారు. మాకవరపాలెం సచివాలయంలో.డ్వాక్రా మహిళలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రక్తహీనత ఉన్న మహిళలను గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకుగాను మందులు ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. రక్తహీనత కలిగిన వారు వైద్య సిబ్బందితో పాటు అంగన్వాడి సిబ్బందిని కలవాలన్నారు ఈ కార్యక్రమంలో వెలుగు సిసి శ్రీరామ్, వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

కవగుంటలో నగర సంకీర్తన

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో కవగుంట పంచాయతీలో శుక్రవారం తెల్లవారుజామున నగర సంకీర్తనలో భాగంగా మేలుకొలుపును వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి సూర్య కుమార్ వరహాలు మాట్లాడుతూ, గ్రామంలో మహిళలు, పిల్లలు, ప్రజలు ఆధ్యాత్మికంగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన మేలుకొలుపు బృందాల ప్రతినిధులు పరవాడ రమణ, చేపూరి రాజనాయుడు, మలుకూరి కిషోర్, పచ్చికొర వరహాలు, పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న గ్రామస్తులు

అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

జాతీయ స్థాయి టెక్‌ఫెస్ట్‌లో మిజోరం గవర్నర్ డాక్టర్ హరిబాబు

ప్రజాశక్తి-తగరపువలస : ప్రస్తుతమున్న ప్రత్యేక పరిస్థితుల్లో విద్యార్థులు అధునాత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు సూచించారు. స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండ్రోజుల పాటు జరుగనున్న జివైఎఎన్ -2 కె23 జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్‌ను శుక్రవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం, సౌకర్యాలు ఏమాత్రం అందుబాటులో లేవన్నారు. ప్రతి రంగంలోనూ నైపుణ్యం అవసరమన్నారు. అవంతి విద్యా సంస్థల అధినేత, స్థానిక ఎమ్మెల్యే ము త్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కష్టబడి చదివితే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జివిఆర్ ప్రసాద రాజు మాట్లాడుతూ, టెక్నికల్ స్కిల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్ అండ్ లైఫ్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్ ఎం.సైదులు మాట్లాడుతూ, విద్యార్థుల సందేహాలను నివృతికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ ఐ శ్రావణ్‌కుమార్, ప్రిన్సిపల్స్ డాక్టర్ మోహనరావు, రాజు, డాక్టర్ గోవిందరావు, డాక్టర్ జయప్రసాద్, ప్లేస్‌మెంట్ విభాగ అధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, పరిపాలన అధికారి సంతోష్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలనతో ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న హరిబాబు

దాడి చేయడంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -నక్కపల్లి:రాజయ్యపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్‌తో పాటు ఇద్దరి కుమారులపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి పివిపి రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో తుఫాన్ సెంటర్ వద్ద గ్రామసభ నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన పిక్కి స్వామి, పిక్కి కోటి, మైలపల్లి ప్రసాద్ కలిసి గ్రామసభకు అడుగడుగున ఆటంకం కలిగిస్తూ ఇబ్బందులు పెట్టారన్నారన్నారు. సర్పంచ్ అప్పలనరస తనయుడు పిక్కి కోటి, వార్డ్ మెంబర్ పిక్కి కామేశ్వరరావులపై దాడులు చేశారని, సర్పంచ్ అప్పలనరసను కనీసం మహిళని చూడకుండా హత్యా ప్రయత్నం చేయబోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగినైనా తనకు, ప్రజా ప్రతినిధులకు రక్షణ లేకుండా పోయిందని, దాడులకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.


ఫిర్యాదు చేస్తున్న కార్యదర్శి

జివిఎంసి స్థాయీ సంఘంలో అంశాలన్నీ ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. స్థాయీ సంఘం అంశాలలో 23 అంశాలు, ఒక టేబుల్ అజెండా పొందుపరచగా అన్నీ ఆమోదం పొందాయి. బుచ్చిరాజుపాలెంలో రాత్రి నిరాశ్రయుల కేర్ టేకర్, మేనేజర్‌ల పారితోషికంతో పాటు నిర్వహణ ఖర్చులు ఏడాదికి రూ.6.24 లక్షలు, రెవెన్యూ విభాగంలో షాప్ రూములు, వాణిజ్య సముదాయాల అద్దెలు, అద్దె చెల్లించని షాప్‌లకు తాళాలు వంటి అంశాలపై చర్చించారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి జివిఎంసి పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.314.47 లక్షలకు ఆమోదం తెలిపారు. స్థాయీ సంఘ సమావేశంలో సభ్యులతోపాటు ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి సురేష్, ఉప పట్టణ ప్రణాళిక అధికారులు నరేంద్ర, పద్మజ, రత్న కుమార్ పాల్గొన్నారు.

రాయల్ ఓక్ ఫర్నీచర్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సుప్రసిద్ధ ఫర్నీచర్ బ్రాండ్ రాయల్ ఓక్ తమ నూతన స్టోర్‌ను నగరంలోని రామాటాకీస్ రోడ్డులో శుక్రవారం ప్రారంభించింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరయ్యారు. రాయల్ ఓక్ తమ స్టోర్‌ను విశాఖలో ప్రారంభించడం వల్ల ఇక్కడి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. రాయల్ ఓక్ ఇంక్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ విజయ్ సుబ్రమణియం మాట్లాడుతూ సోఫాలు, రిక్లైనర్స్, డైనింగ్, మ్యాట్రెసస్, బెడ్స్, డెకార్, ఆఫీస్, అవుట్ డోర్ ఫర్నీచర్‌కు తమ సంస్థ పేరుగాంచిందన్నారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మథన్ సుబ్రమణియం, విశాఖ హెడ్ రాజేష్ పటేల్, ఫ్రాంచైజీ హెడ్ కిరణ్ ఛాబ్రియా, ఎపి, తెలంగాణ ఫ్రాంచైజీ హెడ్ ఫణి కుమార్ దాట్ల, కార్పొరేటర్ గొలగాని వీరారావు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ ఫోరం ఏర్పాటు


ప్రజాశక్తి-పాడేరు: పాడేరులో జర్నలిస్టులు నూతనంగా పాడేరు జర్నలిస్ట్ ఫోరం(పిజెఎఫ్)ను ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘం భవన్ లో శుక్రవారం పట్టణంలో సీనియర్ పాత్రికేయులు సమావేశం ఏర్పాటు చేసుకుని పాడేరు జర్నలిస్ట్ ఫారం ఆవిర్భావాన్ని ప్రకటించారు. ప్రింట్ మీడియా తరఫున వార్త స్టాఫ్ రిపోర్టర్ పి.సత్యనారాయణను కన్వీనర్ గాను, ఎలక్ట్రానిక్ మీడియా తరఫున కన్వీనర్‌గా టీవీ5 రిపోర్టర్ పిడి చక్రవర్తిని ఎన్నుకున్నారు. పాడేరు పట్టణం నుంచి ప్రముఖ దినపత్రికలకు టీవీ చానల్స్ కు ప్రాతినిథ్యం వహిస్తున్న 18 మంది రిపోర్టర్లతో పిజెఎఫ్‌ను ఏర్పాటు చేశారు.

మహారాష్ట్ర విద్యుత్ కార్మికులకు జేజేలు : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్:విద్యుత్ సంస్కరణల్లో భాగంగా మహారాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలో విద్యుత్‌ను మొత్తం ప్రైవేటీకరించడానికి పూనుకోగా ఆ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 86 వేల మంది కార్మికులు, ఇంజినీర్లు, కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 4వ తేదీ నుంచి సమ్మెలోకి దిగి విజయం సాధించారని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సమ్మె కారణంగా మహారాష్ట్ర మొత్తం అంధకారం అయిందన్నారు. 72 గంటల పాటు సమ్మె అనంతరం మహారాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి విద్యుత్ ప్రైవేటీకరణ చేయబోమని, ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేసిందన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టిన మహారాష్ట్ర విద్యుత్ కార్మికులకు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ జేజేలు పలుకుతోందన్నారు. కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రైల్వే, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, ఆయిల్ సెక్టార్, 5జి, బొగ్గు గనులు, రక్షణ రంగం మొదలగు ప్రభుత్వరంగ పరిశ్రమలన్నింటినీ కార్పొరేట్ అధిపతులైన అదానీ, అంబానీలకు కట్టబెడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి ప్రభుత్వం విద్యుత్‌ను ప్రైవేటీకరణ చేయాలని, రైతుల పంపు సెంట్లకు స్మార్ట్, ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని ప్రయత్నిస్తోందన్నారు. అదేగనుక జరిగితే విద్యుత్ వినియోగదారులమీద తీవ్రమైన భారాలు పడతాయని తెలిపారు. మహారాష్ట్ర విద్యుత్ కార్మికుల పోరాట స్ఫూర్తితో ఎపిలో ప్రైవేటీకరణ చర్యలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం తగదు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గంలో పర్యటించకుండా పోలీసులు అడ్డుకోవడం తగదని నర్సీపట్నం తెలుగుదేశం పార్టీ నాయకులు నేతల నాగేశ్వరరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబు తన సొంత నియోజక వర్గమైన కుప్పంలో ప్రజా సమస్యల తెలుసుకునేందుకు పర్యటిస్తుంటే ప్రభుత్వం, పోలీసులు అడ్డుకోవడం తగదన్నారు. చంద్రబాబు సభలకు ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారని ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధిస్తుందని విమర్శించారు. గతంలో కూడా టిడిపి ప్రభుత్వం కూడా ఇదే ధోరణి అవలంభిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాద యాత్ర ఎలా చేసేవారని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం ఇటువంటి ధోరణి అవలంభించడం తగదన్నారు.



కుమారుని వివాహ ఏర్పాట్లలో ఎంపీ ఎంవివి

- రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ తన కుమారుడు శరత్ చౌదరి వివాహ ఏర్పాట్లలో బిజీబిజీ అయ్యారు. రాష్ట్రంలో పలువురు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులకు వివాహ ఆహ్వాన పత్రికలను అందించే పనిలో నిమగ్నమయ్యారు. శుక్రవారం తాడేపల్లిలోని సిఎం నివాసానికి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి, వైఎస్.భారతి దంపతులకు స్వయంగా ఎంవివి, ఆయన సతీమణి జ్యోతి వివాహ పత్రికను అందజేసి పెళ్లికి ఆహ్వానం పలికారు.


సిఎం దంపతులకు శుభలేఖను అందజేస్తున్న ఎంపీ ఎంవివి

పేదలకు అన్నసమారాధన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయాతన దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమి రోజు అన్నదానం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అనాథలకు, అన్నార్తులకు, యాచకులకు, కూలీలకు సుమారు వంద మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. వాసవి క్లబ్ నర్సీపట్నం సభ్యులు పోలిశెట్టి నారాయణరావు, సీతామహాలక్ష్మి, వెచ్చా వీరేంద్రకుమార్ శ్రావణి దంపతులు, గుంటూరు తవ్వా భాగవతి లక్ష్మి భోజనాలు ఏర్పాటు చేశారు.


వడ్డిస్తున్న నిర్వాహకులు

పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో శుక్రవారం చోద్యం నుంచి వచ్చే మెయిన్ మంచినీటి పైప్‌లైన్ గొజ్జమాను పాకల బ్రిడ్జి వద్ద జాయింట్ వదిలి వేయడంతో ఏఎల్ పురం తో పాటు చుట్టు పక్కల గ్రామా లకు మంచినీటి సరఫరా నిలిచి పోయింది. ఈ విషయాన్ని గ్రామ స్తులు గ్రామ సర్పంచ్ లోచల సుజాతకు తెలియజేయగా ఆమె వెంటనే స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారాన్ని అందించారు. ఈ మేరకు దగ్గరుండి మరమ్మతులు చేయించారు.


మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్

నిధుల వినియోగంపై ఆడిట్


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిటర్

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం అసిస్టెంట్ ఆడిటర్ శ్రీనివాసరావు పలు పంచాయతీలకు సంబంధించి జమాపద్దుల ఆడిట్ చేపట్టారు. ఇందులో భాగంగా సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి అన్నవరం, పందూరు, బోడపాలెం, ఆర్‌సి పురం, ఆక్సాహెబ్ పేట గ్రామాల జమాపద్దుల వివరాలు తనిఖీ నిర్వహించారు. పంచాయతీలో చేపట్టిన పనుల వివరాలు, ఖర్చులు తదితర వివరాలపై ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐద్వా జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ఐద్వా 13వ ఆల్ ఇండియా మహాసభను జయప్రదం చేయాలని గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పెదలబుడు పంచాయతీ శరభగుడా, బొండం పంచాయతీ కొత్తవలస, రంగినీవలస, రేగాలో జెండాలను ఆవిష్కరణ చేశారు. ఈనెల 6,7,8,9వ తేదీలో ఆల్ ఇండియా మహాసభ కేరళ రాష్ట్రంలో తిరువనంతపురంలో జరుగుతాయని ఐద్వా రాష్ట్ర నాయకులు వివి జయ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలకు అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తారని తెలిపారు. పని ప్రదేశాల్లో శ్రామిక మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుని పార్లమెంట్లో ఆమోదం పెట్టాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం వెంటనే 33శాతం బిల్లును ఆమోదించి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రెటరీ శశికళ, రాధా, లక్ష్మి, సుందరమ్మ, కళా, సుశీల, నాగమ్మ పాల్గొన్నారు.